

## విలేఖరులకు ఆహ్వానం

వరంగల్ వాయిస్ సాయంకాలం దినపత్రిలో పనిచేయుటకు ఆసక్తి కలిగిన విలేఖరులు, అడ్వటైజ్ మెంట్ ఏజెంట్లకు యాజమాన్యం స్వాగతం పలుకుతోంది. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల స్టాఫ్ రిపోర్టర్లతోపాటు నర్సంపేట, కాటారం, మరిపెడ, క్రైం, ఎంజీఎం, గ్రేన్ మార్కెట్, వరంగల్ కలెక్టరేట్, హనుమకొండ కలెక్టరేట్, స్టేషన్ ఘనపూర్ పరిధిలో పనిచేయుటకు ఆసక్తి కలిగిన వారు సెల్ నెంబర్ 99891 24061, 98499 43339 లలో సంప్రదించగలరు. - వరంగల్ వాయిస్ యాజమాన్యం


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 334
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
అక్టోబర్ 22, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





వివరాలు2లో..

# ఆర్టీఏ అధికారులకే.. టోకరా..!

## ఏసీబీ పేరిట ఘరానా మోసం

హలో.. నేను ఏసీబీ డీఎస్పీని మాట్లాడుతున్నా.. మీరు లంచం బాగా తీసుకుంటున్నారట.. మీ మీద మాకు ఫిర్యాదు వచ్చింది.. సెటిల్మెంట్ చేసుకోండి.. అవినీతి కేసులో అరెస్టు కాకుండా ఉండాలంటే తాము అడిగినంత డబ్బు చెల్లించాలి.. అర్జెంటుగా డబ్బులు ఆన్ లైన్ అకౌంట్ కు పంపించండి అంటూ ఓ అగంతకుడు వరంగల్ జిల్లాలోని ఇద్దరు ఆర్టీఏ అధికారులకు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడ్డ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆందోళన చెందిన ఆర్టీఏ అధికారులు.. దుండగులకు దశలవారీగా రూ.10.20 లక్షలు చెల్లించారు. దుండగులతో ఫోన్‌లో మాట్లాడుతున్న క్రమంలో ఒక ఆర్టీఏ అధికారికి అనుమానం వచ్చింది. దీంతో ఆయన నేరుగా అసలు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వెంటనే దీనిపై విచారణకు ఆదేశించారు. ఏసీబీ అధికారులు చేసిన విచారణ ద్వారా.. తాము నకిలీ అధికారుల బారిన పడి మోసపోయామని సదరు ఆర్టీఏ అధికారులు గ్రహించారు. అనంతరం దుండగులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఇలాంటి మోసపూరిత ఘటనలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలంటూ అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ ఎక్స్ వేదికగా ఒక ప్రకటనలో హెచ్చరించారు. అనుమానం వస్తే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. – వరంగల్ వాయిస్ ప్రతినిధి




- రూ.10.20 లక్షల వసూలు
- వరంగల్ జిల్లాలో ఘటన
- మోసగాళ్లపై పోలీసులకు ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన ఏసీబీ డీఎస్పీ సాంబయ్య
- అప్రమత్తంగా ఉండాలన్న అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్



# రెండేళ్లలో రూ.1,400 కోట్లు మంజూరు

- నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** రైతు పక్షపాతిగా ఉంటూ ప్రజా సంక్షేమానికి, మహిళా సంక్షేమనికి కృషి చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. రఘునాథపల్లి మండలం ఖిలాషపూర్, మంగలి బండ తండా, జాఫర్ గూడెం, వెల్ది గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక అభివృద్ధి నిధులను స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి తీసుకొచ్చానన్నారు. గడిచిన రెండు ఏళ్లలోనే రూ.1,400 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఏడాదిలో అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజల కళ్ల ముందు ఉంచుతానని హామీ ఇచ్చారు. ఒక్క రఘునాథపల్లి మండలంలోనే ప్రతీ తండాకు పక్కా రోడు ఉండాలని రూ.30కోట్లతో అన్ని తండాలకు బిటీ రోడ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

(మిగితా 8లో..)



2లో..

## పోలీస్ జాగృతి కార్యక్రమాలతో.. ప్రజల్లో చైతన్యం రావాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

## మేడారంపై ఉన్నత స్థాయి సమీక్ష

- ఏర్పాట్లపై దిశా నిర్దేశం
- నిర్వహించిన గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్
- పాల్గొన్న కలెక్టర్లు, పోలీసులు



8లో..


## పెద్దకర్మ

స్వస్తి శ్రీ విశ్వావసు నామ సం॥ర ఆశ్వీయుజ శు॥ అష్టమి తేది. 13-10-2025 సోమవారం రోజున రా॥ 07-47 ని॥లకు మా తండ్రి గారైన

**శ్రీ బైరి సాంబయ్య గారు**
కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్



పరమపదించినారని తెలుపుటకు చింతించుచున్నాము. తేది 23-10-2025 గురువారము రోజున పెద్దకర్మ సపిండీకరణము, పున్యాహవచనము జరుపబడును. కావున తామెల్లరు సకాలమున విచ్చేసి మా తండ్రి గారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని ప్రార్థన.

ఇట్లు
భార్య : బైరి లక్ష్మీకుమారి, GWMC 8th Division Corporator
కుమారులు-కోడళ్ళు : బైరి చైతన్య కుమార్-స్వాతి
: బైరి క్రాంతి కుమార్-శ్రీవాణి
: బైరి శ్రవణ్ కుమార్-లావణ్య, BJP Dist. Leader
కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు మరియు మనుమనులు-మనుమరాళ్ళు

కార్య స్థలము : మా స్వగృహమునందు
ఇనెం. 3-8-91, సమత హైస్కూల్ ప్రక్కన కుమార్‌పల్లి, హనుమకొండ.
సెల్ : 9949009192, 8801735457, 9885027843
సహపంక్తి భోజనం : మధ్యాహ్నం 12-30 గంటలకు

# ఆర్టీఏ అధికారులకే టోకరా..!

- ఏసీబీ పేరిట ఘరానా మోసం
- రూ.10.20 లక్షల వసూలు
- వరంగల్ జిల్లాలో ఘటన
- మోసగాళ్లపై పోలీసులకు ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన ఏసీబీ డీఎస్పీ సాంబయ్య
- అప్రమత్తంగా ఉండాలన్న అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ప్రభుత్వ ఉద్యోగులే లక్ష్యంగా కొత్త తరహా మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఏసీబీ అధికారులమని నమ్మించి.. వరంగల్ ఆర్టీఏ అధికారుల నుంచి ఏకంగా రూ.10.20 లక్షలు కాజేసిన ఘటన వరంగల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల ఆర్టీఏ చెక్ పోస్టుల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించి అక్కడ జరుగుతున్న అవినీతిని గుర్తించారు. ఈ తనిఖీల గురించి తెలుసుకున్న కేటుగాళ్లు.. హలో నేను ఏసీబీ డీఎస్పీని మాట్లాడుతున్నా. మీరు లంచం బాగా తీసుకుంటున్నారట.. మీ మీద మాకు ఫిర్యాదు వచ్చింది.. సెటిల్మెంట్ చేసుకోండి.. అర్జెంటుగా డబ్బులు ఆన్ లైన్ అకౌంట్ కు పంపించండి అంటూ ఓ అగంతకుడు వరంగల్ జిల్లాలో ఇద్దరు అధికారులకు ఫోన్లు చేశాడు.

**రూ. 10.20 లక్షల వసూలు..**

ఈ క్రమంలో నాలుగు రోజుల కిందట వరంగల్ ఆర్టీఏ అధికారులకు గుర్తు తెలియని వ్యక్తులు 98868 26656, 98804 72272, 95919 38585 నెంబర్ నుంచి ఫోన్ చేశారు. ఆర్టీఏ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అంతా తెలుసని, అరెస్టు కాకుండా ఉండాలంటే చెప్పినంత డబ్బులు పంపించాలని ఎంవీఐలపై బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆందోళన చెందిన ఆర్టీఏ అధికారులు దశల వారీగా రూ.10.20 లక్షలను గుర్తు తెలియని వ్యక్తుల అకౌంట్ లో జమ చేశారు.

**అనుమానం వచ్చి..**

దుండగులతో ఫోన్‌లో మాట్లాడుతున్న క్రమంలో ఒక మోటర్ వెహికిల్ అధికారికి (ఎంవీఐ) కి అనుమానం వచ్చింది. వెంటనే వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను ఆశ్రయించి జరిగిన విషయాన్ని తెలియజేశారు. అలాంటి ఫోన్స్ తాము చేయమని, గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో మిమ్ముల్ని మోసం చేశారని చెప్పడంతో పాటు వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. కాగా, తాము మోసపోయిన విషయం బయట పడకుండా ఆర్టీఏ అధికారులు యత్నించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విషయంలో స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, త్వరలోనే పూర్తి విషయాలు చెబుతామని దాటవేశారు.

**అప్రమత్తంగా ఉండాలి..**

కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు మొబైల్ నంబర్ల ద్వారా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులమని చెప్పుకుంటూ నకిలీ కాల్స్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ఆ శాఖ డైరెక్టర్ జనరల్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ కాల్స్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి, వారిపై కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలోని మిల్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఇలాంటి ఒక సంఘటనపై ఇప్పటికే ఫిర్యాదు కూడా నమోదైందదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ ఇటువంటి మోసపూరిత కాల్స్‌ను నమ్మవద్దన్నారు. వారికి డబ్బు చెల్లించవద్దన్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి, సాధారణ పౌరులకు ఎవరికైనా ఏసీబీ అధికారుల పేరుతో ఇలాంటి బెదిరింపు కాల్స్ వస్తే వారు తక్షణమే సమాచారం అందించాలన్నారు. ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930, లేదా స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు వాట్సాప్ 9440446106, ఫేస్‌బుక్ Telangana ACB,ఎక్స్ @TelanganaACB లకు సమాచారం అందించాలన్నారు. బాధితులు, ఫిర్యాదుదారుల పేరు, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.





## ఘనంగా కార్తీక మాసోత్సవాలు ప్రారంభం

- రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే దంపతులు
- వేయి స్తంభాల గుడిలో నాయినికి ఘన స్వాగతం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పరమశివుడికి ఎంతో ప్రీతి పాత్రమైన కార్తీక మాసోత్సవ వేడుకలను బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపుతులు వేయి స్తంభాల దేవాలయంలో జ్యోతి వెలిగించి అధికారికంగా ప్రారంభించారు. అంతకముందు ఎమ్మెల్యే నాయిని దంపతులు రుద్రేశ్వర స్వామి వారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించి, మహదాశీర్వచనం అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్తీక మాసం అనేది శైవ భక్తులకే కాదు, ప్రతి హిందువుకూ ఒక పవిత్రమైన కాలం అన్నారు. పరమశివుని ఆరాధనకు ఈ మాసం ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగిస్తూ, శివాలయాలకు వచ్చి పూజలు చేయాలని కోరారు. మన సంస్కృతి, సంప్రదాయాలను మరింత బలంగా నిలబెట్టే కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాల్గొనాలన్నారు. ఈ కార్తీక మాసం అందరికీ శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యాన్ని అందించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్తీక మాస పూజ కార్యక్రమాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ సంపత్, ఆలయ కార్యనిర్వాహక అధికారి అనిల్, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, నాయకులు కుమార్ యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## రిజర్వేషన్ ధర్నాను విజయవంతం చేద్దాం

**బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ పిలుపు**

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** వరంగల్ జిల్లా కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కొరకు అక్టోబర్ 24 న హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ సమీపంలో నిర్వహించనున్న భారీ ధర్నాను విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ చందా మల్లయ్య మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు ఉపక్రమించేది లేదని ప్రకటించారు. ఈ నెల 24 న జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్, బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో అన్ని బీసీ సంఘాల మద్దతుతో నిర్వహించనున్న భారీ ధర్నాలో బీసీలు ఐక్యంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచారు. ఈ ధర్నాలో భవిష్యత్ ప్రణాళిక మహా పోరాటాన్ని ప్రకటించనున్నందున అందరూ అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ ఇంచార్జి సాయిబాబా, బీసీ కుల సంఘాల నాయకులు సురేష్ ముదిరాజ్, మాటేటి బాలకృష్ణ, కిరణ్ కుమార్, రవిరాజ్, మేకల సుమన్, సునీల్, రొడ్డ మురళీకృష్ణ, సిలువేరు మల్లికార్జున్, జన్ను కళ్యాణ్, దామెర శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ జాగృతి కార్యక్రమాలతో..
## ప్రజల్లో చైతన్యం రావాలి



**☐ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ వాయిస్, క్రైం :** పోలీస్ జాగృతి కళా బృందం నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకరావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో బుధవారం పోలీస్ జాగృతి కళా బృందం సభ్యులతో సీపీ ముచ్చటించారు. ఈ సందర్భంగా జాగృతి కళా బృందం గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. ఏఏ అంశాలపై ప్రజలకు అవగహన కల్పిస్తున్నారంటూ కళా బృందం ఇంచార్జి ఏఎస్ ఈ నాగమణిని అడిగి తెలుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్ సేఫ్టీ, మూఢ నమ్మకాలు, షీ టీం, డయల్ 100, మత్తు పదార్థాలపై అవగహన కల్పించేలా గ్రామీణ ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రదర్శనలు ఇవ్వాలన్నారు. కేవలం కథాంశాలే కాకుండా గత మూడు సంత్సరాలుగా జరిగిన నష్టలపై ప్రజలకు వివరించాలని, ముఖ్యంగా కార్యక్రమాల నిర్వహణ కోసం కళా బృందం సభ్యులు ఒక నెల ముందుగానే చక్కటి ప్రణాళికను రూపొందించుకోవడంతో పాటు, సంబంధిత అధికారుల నుంచి పూర్తి సమాచాన్ని సేకరించుకోవాలన్నారు. కళా బృందం కార్యాచరణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిందిగా ఏసీపీ ఎస్ బీ-2 జాన్ నర్సింహులుకు సీపీ సూచించారు. సీపీతో ముచ్చటించిన వారిలో హెడ్ కానిస్టేబుళ్లు విలియమ్, రత్నయ్య, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ పూల్ సింగ్ తో పాటు హోంగార్డ్స్ పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, అక్టోబర్ 22, 2025

# మృత్యు మలుపులు

◆ ప్రమాదకరంగా పర్వతగిరి –రెడ్లవాడ బీటీ రోడ్డు
◆ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
◆ ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రం నుంచి ఇస్లావత్ తండా మీదుగా నెక్కొండ మండలంలోని రెడ్లవాడ వరకు వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు ప్రమాదకరమైన మూల మలుపుల కారణంగా ప్రయాణికులను, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దాదాపు ఏడు కిలోమీటర్ల మేర ఈ రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా, ముఖ్యంగా మూల మలుపుల వద్ద పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు అస్సలు కనబడటం లేదు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పర్వతగిరి మండలంలోని శ్మశాన వాటిక, సబ్ స్టేషన్ సమీపం నుంచి రెడ్లవాడ వరకు ఈ రోడ్డు గుంతలు, ధ్వంసమైన ప్రాంతాలతో నిండి ఉంది. భూక్యా తండా, మూడు తండా, ధరంసోత్ తండా వంటి ఇస్లావత్ తండా పరిధిలోని అనేక గ్రామాల ప్రజలు, అలాగే నెక్కొండ మండలంలోని హస్లి తండా, అజ్మీరా తండా ప్రజలు నిత్యం ఈ రోడ్డునే ఉపయోగిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాకు వెళ్లే వాహనదారులు కూడా ఈ రహదారిపైనే ప్రయాణిస్తున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ రోడ్డు భద్రతకు నోచుకోవడం లేదు.

## అధికారుల నిర్లక్ష్యం..

ఈ ప్రమాదకరమైన రోడ్డుపై వెళ్లాలంటే అరిగోస పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. మూల మలుపుల వద్ద మృత్యువు కాపు కాచి ఉంటుందనే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ రోడ్డుపై అనేక ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు. ఆర్ అండ్ బీ అధికారులు, అలాగే గ్రామాల్లో నియమించిన ప్రత్యేక అధికారులు ఈ సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డుపై ఏర్పడిన గుంతలు, ధ్వంసమైన చోట మరమ్మతు చేయించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. సర్పంచ్ వ్యవస్థ రద్దు అనంతరం ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ, సరైన నిధులు లేకపోవడం వల్లనో, లేదా పర్యవేక్షణ లోపం వల్లనో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి, ప్రమాదాలకు కారణమవుతున్న పిచ్చి మొక్కలను తొలగించి, రోడ్డుపై మరమ్మతులు చేపట్టడం ద్వారా తమ ప్రాణాలను కాపాడాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.





# పుస్తక దానం విద్యార్థులకు జ్ఞాన వారధి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఒక పుస్తకం ఎంతో మంది విద్యార్థులలో జ్ఞానాన్ని నింపుతుందని, మన అవసరం తీరాక వాటిని ఇతరులకు ఉపయోగపడేలా గ్రంథాలయాలకు విరాళంగా ఇవ్వడం ఎంతో అభినందనీయమని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. దీనికి స్ఫూర్తిగా బుధవారం హనుమకొండకు చెందిన పిన్నింటి అశోకరావు తన కుమారుడు డాక్టర్ రాకేష్ ఉపయోగించిన సుమారు 30 వేల రూపాయల విలువైన వైద్యశాస్త్ర పుస్తకాలను కాకతీయ మెడికల్ కళాశాల లైబ్రరీకి అందజేశారు. ఈ పుస్తకాలను ఆయన కళాశాల ప్రిన్సిపాల్ డా. సంధ్య సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా అశోకరావు మాట్లాడుతూ తమ కుమారుడు డాక్టర్ రాకేష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ నిపుణులుగా వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థిగా రాకేష్ ఉపయోగించిన ఈ పుస్తకాలను, అతని సలహో మేరకు విద్యార్థుల ఉపయోగం కోసం మెడికల్ కళాశాలకు విరాళంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పూలే విగ్రహ ధ్వంసం

## ఖండించిన టీడీపీ నాయకులు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం, అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని ఉర్సు దర్గా సమీపంలో ఉన్న బీసీల ఆరాధ్య దైవం, బడుగు బలహీన వర్గాల పోరాట యోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండించింది. బుధవారం పార్టీ నాయకులు ధ్వంసమైన విగ్రహ ప్రాంతాన్ని సందర్శించి, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గతంలోనూ ఈ విగ్రహంపై దాడి జరిగిందని గుర్తుచేసిన టీడీపీ నేతలు, ఈ విధ్వంసానికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రిగా ఉన్న కొండా సురేఖని పత్రికాముఖంగా కోరారు. మంత్రి తక్షణమే ఈ ధ్వంసమైన స్థలాన్ని పరిశీలించి, ప్రభుత్వ ఖర్చులతో యథాస్థానంలో మహాత్మ జ్యోతిరావు పూలే నిలువెత్తు విగ్రహాన్ని వెంటనే నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. విగ్రహ ధ్వంసమైన స్థలాన్ని పరిశీలించిన వారిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్, సీనియర్ నాయకులు శిరబోయిన రాజు, కాంద్రాతి రాజు, పోలేపాక సాయి కుమార్, సురేష్, రాజేష్ తదితరులు ఉన్నారు. ఈ ఘటనపై టిడిపి నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

# నలుగురు మావోయిస్టుల లొంగుబాటు



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఎదుట మంగళవారం నలుగురు మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ నలుగురిలో ముగ్గురు దళ సభ్యులు కాగా, మరొకరు మిలిషియా కమాండర్ అని ఎస్పీ తెలిపారు. వీరిందరూ పొరుగు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని ఆయన వెల్లడించారు. 'పోరుకన్నా... ఊరు మిన్న' అనే కార్యక్రమానికి ప్రభావితమై మాడవి కోసి, మాడవి ఇడుమ, మచ్చకి దేవా, మడకం బండి లొంగిపోయినట్లు ఎస్పీ ప్రకటించారు. లొంగిపోయిన వారికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున నగదు అందించినట్లు తెలిపారు. మావోయిస్టులు లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలవాలని ఈ సందర్భంగా ఎస్పీ పిలుపునిచ్చారు.

# ముమ్మరంగా చెరువు కట్ట మరమ్మత్తు పనులు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని తాడిచెర్ల గ్రామస్తులు, రైతుల అభ్యర్థన మేరకు ఆ ఊరిలోని ఊర చెరువు కట్ట మరమ్మత్తు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గత కొద్ది రోజుల క్రితం గ్రామస్థులు, రైతులు చెరువు మరమ్మత్తులు చేపట్టాలని తాడిచెర్లలో బొగ్గు నిక్షేపాలను వెలికితీస్తున్న ఏఎమ్మార్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు, ఆ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం చెరువు కట్ట మరమ్మత్తు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనుల్లో భాగంగా, చెరువు కట్టపై ఉన్న తుమ్మ చెట్లను తొలగించడం, కట్టపై రోడ్డును వెడల్పు చేయడం వంటి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పనులు వేగంగా జరుగుతుండటం పట్ల గ్రామస్తులు, రైతులు ఏఎమ్మార్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లు బొబ్బిలి నరేష్, నవీన్ పాల్గొన్నారు.

# 'కుడా' పరిధిలోని భూములకు సాదా బైనామా చట్టం వర్తింపచేయాలి

■ ఏబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి మహేందర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్, హనుమకొండ జిల్లాలలోని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో తెల్ల కాగితాల (సాదా బైనామా) ద్వారా క్రయవిక్రయాలు జరిగిన వ్యవసాయ భూములకు సాదా బైనామా చట్టాన్ని వర్తింపజేయాలని అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కుడా పరిధిలో చాలా వ్యవసాయ భూముల వివరాలు భూభారతి పోర్టల్ లో 'డిజిటల్ సైన్ పెండింగ్', 'సాదా బైనామా కేసులు', 'కేవైసీ నాట్ అప్‌డేట్' అని చూపిస్తున్నాయని తెలిపారు. ఈ కారణంగా, భూమిని అమ్మకం చేసిన వారే ఇప్పటికీ పట్టాదారులుగా కొనసాగుతున్నారని, కానీ సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసిన వారు మాత్రం భూమిని వాస్తవంగా సాగు చేసుకుంటున్నారని ఆయన వివరించారు. కాబట్టి, సాగు చేసుకుంటున్న వారికి వెంటనే పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని



కోరారు. ఈ సమస్య పరిష్కారం కోసం కుడా పరిధిలోని వ్యవసాయ భూములకు సాదా బైనామా చట్టం 2025 ను అమలు చేయాలని కలకోటి మహేందర్ విజ్ఞప్తి చేశారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని, ఈ సమస్యను ముఖ్యమంత్రి, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ ఈ చట్టం కింద వారి భూములను క్రమబద్ధీకరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# 'ప్రజాపక్షం' పత్రికకు ఏసీపీ శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, క్రైం :** ప్రజాపక్షం జాతీయ తెలుగు దినపత్రిక ఏడవ వార్షికోత్సవం సందర్భంగా కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి పత్రిక యాజమాన్యానికి, పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ఏసీపీ ప్రశాంత్ రెడ్డి కేక్ కట్ చేసి, విలేఖరులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తూ, ప్రజాభిమానాన్ని చూరగొనే విధంగా 'ప్రజాపక్షం' పత్రిక ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం పత్రిక జిల్లా ప్రతినిధి తోట సుధాకర్, నవచేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, సీపీఐ జిల్లా నాయకులు మద్దెల ఎల్లేష్, మాలోతు శంకర్, వరంగల్ క్రైమ్, హనుమకొండ, హసన్ పర్తి విలేఖరులు కుక్కల రాజు, ఎండీ ఉస్మాన్ పాషా, ఎర్ర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సీఐ సంతోష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా, ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది "పోలీస్ అమరవీరులకు జోహార్... జోహార్ పోలీస్ వీరులు" అంటూ నినాదాలు చేశారు. సీఐ సంతోష్ మాట్లాడుతూ దేశం కోసం పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను కాపాడుతున్నారని, వారి సేవలు వెలకట్టలేనివి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు తిరుపతి, సతీష్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని కామారెడ్డిపల్లెలో బుధవారం తెల్లవారుజామున బాలాజీ సామిల్, టింబర్ డిపో అగ్ని ప్రమాదానికి గురైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న వెంటనే బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతరెడ్డి మధుసూదన్ రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి, డిపో యజమానులను పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మధుసూదన్ రెడ్డితో పాటు కామారెడ్డిపల్లె మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, యూత్ కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆనందోత్సవాలతో దీపావళి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** చీకటిని పారదోలుతూ వెలుగుల పండుగ దీపావళిని శాయంపేట మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ ఏడాది సోమ, మంగళ రెండు రోజులు ఈ పండుగ సంబరాలు కొనసాగాయి. మండలంలోని ఇళ్లు, వ్యాపార సముదాయాలు, కార్యాలయాలను ప్రజలు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. సాయంత్రం వేళ భక్తిశ్రద్ధలతో లక్ష్మీ పూజలు నిర్వహించారు. పూజలు పూర్తయిన తర్వాత, టపాకాయలు కాల్చుతూ, ప్రజలు ఆనందోత్సవాలతో దీపావళి పండుగను జరుపుకున్నారు.

## 26న గ్రూప్-1, 2 విజేతలైన పద్మశాలి యువతకు అభినందన సభ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం, వరంగల్ జిల్లా పద్మశాలి జర్నలిస్టుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షల్లో విజయం సాధించిన పద్మశాలి యువతను సన్మానించేందుకు ఈ నెల 26న ఉదయం 11:00 గంటలకు హనుమకొండ జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. గ్రూప్ 1, గ్రూప్ 2 లో విజయం సాధించిన పద్మశాలి యువతీ యువకులు తమ వివరాలను కోడం రవిప్రకాష్ (జిల్లా అధ్యక్షుడు, టీపీయూఎస్, వరంగల్): 94909 59428, వేముల నాగరాజు (అధ్యక్షులు, పద్మశాలి జర్నలిస్ట్ సంఘం) తెలియజేయగలరని పేర్కొన్నారు. .వివరాల కోసం సంప్రదించండి

## వీధి కుక్కలకు వింత రోగం



■ స్థానికుల్లో భయాందోళన
■ పట్టించుకోని అధికారులు

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలోని పలు గ్రామాలలో వీధి కుక్కలకు వింత చర్మ వ్యాధి సోకడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ వ్యాధి కారణంగా వీధుల్లో కనిపించే కుక్కల చర్మం ఊడిపోయి, నల్లటి మచ్చలతో దర్శనమిస్తున్నాయి. కుక్కలకు దద్దుర్లు లేచి, తీవ్రమైన దురదతో పుండ్లు పడి, నీరు కారుతోంది. ఈ పుండ్లపై ఈగలు, దోమలు వాలి తిరిగి ఇళ్లలోకి వస్తుండటంతో, కుక్కలకు సోకిన ఈ అలెర్జీ చర్మ రోగం మనుషులకు కూడా వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు. గ్రామాలలో అధిక సంఖ్యలో వీధి కుక్కలకు ఈ చర్మవ్యాధి సోకి, అవి గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. వ్యాధి తీవ్రత పెరిగి ఇప్పటికే పలు కుక్కలు మృత్యువాత పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వ్యాధి సోకిన కుక్కలతో కలిసి ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉన్న ఇతర కుక్కలకు కూడా ఈ వ్యాధి వేగంగా వ్యాపిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగా తమ పిల్లలను బయటకు పంపడానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే చొరవ చూపించి, పశు వైద్య అధికారి సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



## 'సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్'కు భూమిపూజ



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ (కేయూ) క్యాంపస్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన "సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్ (సీఐసీ) భవనం" నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ (వీసీ) ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ భవనం రూ. 3.5 కోట్ల వ్యయంతో, కేంద్ర ప్రభుత్వ రుసా (రుసా- రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్) నిధుల ద్వారా నిర్మించనున్నారు. ఈ సెంటర్ మొత్తం రెండు అంతస్తులతో నిర్మించబడుతుంది. ప్రతి అంతస్తు 6,786 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగి ఉంటుంది. ఈ భవనంలో రుసా నిధుల ద్వారా పొందిన ఆధునిక పరికరాలను ఏర్పాటు చేసి, వాటిని విశ్వవిద్యాలయం విద్యా, పరిశోధన అవసరాల కోసం వినియోగించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మరియు అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్ లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజు, డాక్టర్ సుకుమారి, ఆచార్య ఎం.నవీన్, రుసా నోడల్ ఆఫీసర్ ఆచార్య మల్లికార్జున రెడ్డి, వివిధ డీన్‌లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ప్రాజెక్ట్ అధికారులు, బోధనా మరియు బోధనేతర సిబ్బంది, టీజీఈడబ్ల్యూఐడీసీ డిప్యూటీ ఇంజనీర్ రామిశెట్టి రవీందర్, బిల్డింగ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** డివిజన్ కేంద్రంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వీధిలో ఇటీవల అనారోగ్యంతో హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా కమిటీ మెంబర్ రామిశెట్టి నవీన్ తల్లి వెంకటమ్మ మరణించారు. కాగా బుధవారం ఆమె దశదినకర్మలో సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్, టీం సభ్యులు పాల్గొని నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం లాలయ్య, నాగేశ్వరరావు, సందీప్, రాజు, నవీన్ పాల్గొన్నారు.

## దేవాలయానికి విరాళం

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో ప్రఖ్యాతి గాంచిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో జరగనున్న ప్రతిష్ఠాపన మహోత్సవం కోసం స్థానిక కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు సి. రిగినేనీ సుమలత బాపురావు రూ.10,005 నగదును ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ గారు ప్రత్యేక పూజలు నిర్వహించి, విరాళం అందించిన వారికి ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూలా శ్రీనివాస్ గౌడ్, భటిక స్వామి, బూర రాజగోపాల్ గౌడ్, మాదాసు మొగిలి గౌడ్, మాదాసు అర్జున గౌడు, ఉయ్యాల భిక్షపతి గౌడ్, దయ్యాల భద్రయ్య, పాండవుల భద్రయ్య, మోటపోతుల రాజన్న గౌడ్, గోరంటల రాజన్న గుప్త పాల్గొన్నారు.

## ఆదివాసీల అస్తిత్వ పోరాట యోధుడు కొమరం భీమ్

● కేయూ వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి

**వరంగల్ వాయిస్, కేయూ :** "ఆదివాసీల అస్తిత్వ పోరాట యోధుడు కొమరం భీమ్" అని కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ ఎస్సీ/ఎస్టీ సెల్ సంచాలకులు డాక్టర్ ఎ.రాజు ఆధ్వర్యంలో పరిపాలనా భవనం ప్రాంగణంలో నిర్వహించిన "ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు కొమరం భీమ్ 124వ జయంతి" సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వీసీ ప్రతాప్ రెడ్డి అధ్యాపకులు, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కొమరం భీమ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహానాయకుడు ఆయన అని కొనియాడారు. విశ్వవిద్యాలయ స్థాయిలో కొమరం భీమ్ పేరిట ఒక జాతీయ సదస్సు నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ – కొమరం భీమ్ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన యోధుడు అని, ఆదివాసీల అభివృద్ధికి దిశానిర్దేశం



చేసిన దీపస్తంభం అని కొనియాడారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు ఇప్పించడంలో ఆయన గౌరవనీయమైన పాత్ర పోషించారని, ఆయన సేవలు చిరస్మరణీయమైనవి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్ లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజు, డాక్టర్ సుకుమారి, ఆచార్య ఎం.నవీన్ తో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగ అధిపతులు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీరాజ్ వల్లల సంయోజకుడిగా వ్యవహరించారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, అక్టోబర్ 22, 2025

# రైతులకు కపాసి కిసాన్ యాప్ తో ప్రయోజనం



◆ హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ కొనుగోళ్లకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రొక్యూర్మెంట్ స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన తెలంగాణ ప్రభుత్వ హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా బుధవారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. సందర్శనకు ముందు ఆమె హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు జి.సంధ్యారాణి (వరంగల్), ఎ. వెంకట్ రెడ్డి (హన్మకొండ), జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్ సందర్శనలో భాగంగా పత్తి యార్డును పరిశీలించిన యాస్మిన్ బాషా.. రైతులు తీసుకొచ్చిన పత్తిలో నాణ్యత, తేమ శాతం ఎంతవరకు వస్తున్నాయో యార్డు పర్యవేక్షకులను అడిగి తెలుసుకున్నారు. వెంకటసాయి ట్రేడర్స్ అడ్డాకు వచ్చిన హనుమకొండ జిల్లాకు చెందిన రైతు యం. వెంకటేశ్వర్లు (గ్రామం కడికూడ)తో ఆమె నేరుగా మాట్లాడారు. కనీస మద్దతు ధర పొందేందుకు, కొనుగోలు కేంద్రాలలో పత్తిని అమ్ముకోవడానికి ముందుగా కపాసి కిసాన్ యాప్ ద్వారా తమ ప్రాంత వ్యవసాయ అధికారి, మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లను సంప్రదించి స్లాట్ బుక్ చేసుకోవాలని రైతులకు సూచించారు. స్లాట్ నిర్ధారణ అయిన తర్వాతే పత్తిని విక్రయం కొరకు తీసుకురావాలని తెలిపారు. అలాగే, తమ గ్రామ వ్యవసాయ అధికారుల వద్ద పంట వివరాలతో పాటు తమ మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. తరువాత, మార్కెట్ కమిటీ పరిధిలోని శ్రీరాజి కాటన్ ఇండస్ట్రీస్ మిల్లును పరిశీలించిన ఆమె, మిల్లు యజమానులు కపాసి కిసాన్ యాప్‌కు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు రైతులకు కనబడే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాకుండా, మార్కెట్ కమిటీ అధికారులకు కూడా ఆమె దిశానిర్దేశం చేశారు. కపాసి కిసాన్ యాప్ నందు స్లాట్ బుకింగ్ నమోదుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు మార్కెట్ యార్డుల్లో మరికొన్ని ఫ్లెక్సీ బ్యానర్లు, గ్రామాల్లో టామ్ టామ్ (డాంకింగ్), వాయిస్, వీడియో రికార్డింగ్‌ల ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉప సంచాలకులు మార్కెటింగ్ వరంగల్ వి.పద్మావతి, జిల్లా మార్కెటింగ్ అధికారి వరంగల్ కె. సురేఖ, డీఏవోలు (వరంగల్) అనురాధ, (హనుమకొండ) రవీందర్ సింగ్, డీహెచ్ఎస్ఓలు అనసూయ (హనుమకొండ), శ్రీనివాస రావు (వరంగల్), డీసీవో సంజీవరెడ్డి (హనుమకొండ), డీఆర్ డీఓలు రాంరెడ్డి (వరంగల్), శ్రీనివాస్ రావు (హనుమకొండ), సివిల్ సప్లై అధికారులు, మార్కెట్ కార్యదర్శి గ్రేడ్ జి.అంజిత్ రావు, సహాయ కార్యదర్శి జి.రాజేందర్, జిన్నింగ్ మిల్లుల యజమానులు కె.నాగ భూషణం, సీహెచ్.వీరారావు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వెంగళరావు నగర్ డివిజన్ పరిధిలోని 203, 204, 205 బూత్ లలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ సతీమణి వర్ష యాదవ్ కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చగలిగే శక్తి ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందని జంగా రాఘవ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులను గుర్తించి, చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ని గెలిపించాలని వారు ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పత్తి రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి



**వరంగల్ వాయిస్, చిట్యాల :** ఈ నెల 25న జనగామ జిల్లాలో నిర్వహించనున్న పత్తి రైతుల రాష్ట్ర సదస్సును రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం జయశంకర్ జిల్లా కార్యదర్శి చింతల రజనీకాంత్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా పత్తి దిగుబడులు రాక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. రాష్ట్రంలోని పత్తి రైతాంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై ఉన్న సుంకాన్ని కొనసాగించాలి. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలి. రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించేందుకు ఈ రాష్ట్ర సదస్సు దోహదపడుతుందని, కాబట్టి రైతులందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఠాకూర్ ప్రభాకర్ సింగ్ కు నివాళి



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇంఛార్జి డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, బీజేపీ సీనియర్ నాయకులు ఠాకూర్ ప్రభాకర్ సింగ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నర్సంపేట పట్టణానికి చెందిన బీజేపీ పట్టణ నాయకులు ఠాకూర్ శివనాగరాజ్ సింగ్, పట్టణ ఉపాధ్యక్షుడు ఠాకూర్ విజయ్ సింగ్ తండ్రి ప్రభాకర్ సింగ్ ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## సీవీ.ఆనంద్ ను కలిసిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బుధవారం డా. బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన సీవీ. ఆనంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు సీవీ.ఆనంద్ కి పూల మొక్కను అందజేసి, నూతన నియామకం పట్ల తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి బుధవారం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నర్సంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్) ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రం ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులు దిగుబడి పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. రైతులు తక్కువ ఎరువులను వాడుతూ అధిక దిగుబడులు సాధించే విధంగా శాస్త్రీయ కోణంలో వ్యవసాయం చేయాలని కోరారు. అలాగే, పంటకు పంటకు మధ్య క్రాప్ హాలిడే పాటిస్తూ వ్యవసాయాన్ని కొనసాగిస్తే, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నర్సంపేట పీఏసీఎస్ చైర్మన్ బొబ్బల రమణారెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘం అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## నూతనంగా పద్మశాలి పరపతి సంఘం ఏర్పాటు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గలో బుదవారం కాశిబుగ్గ పద్మశాలి సహకార పరపతి సంఘం 150 మంది సభ్యులతో నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాల వేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సంఘం అధ్యక్షుడిగా గుళ్ళపల్లి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా గోరంటల మనోహర్, కోశాధికారిగా పోతన లక్ష్మీనరసింహస్వామి, ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, సహాయ కార్యదర్శిలు మాటేటి విద్యాసాగర్, ములుక సురేష్, సహ కోశాధికారిలు బండారి రాజేశ్వరరావు, సిందం చంద్రశేఖర్, ఆర్గనైజర్స్ కుసుమ నగేష్, క్యాతం రంజిత్, బాల మోహన్, గౌరవ సలహాదారులుగా కుసుమ దయాసాగర్, బండారి శ్రీనివాస్, రాచర్ల శ్రీనివాస్, గుళ్లపల్లి సాంబశివుడు, బేతి అశోక్ బాబు, కార్యవర్గ సభ్యులుగా దాసి శివకృష్ణ, రామ యాదగిరి, గుండు సత్యనారాయణ, చిలగాని రమేష్, వెంగళ లక్ష్మణ్, కూరపాటి మహేష్ లు ఎన్నికయ్యారు. ఈ కమిటీ మూడు సంవత్సరాల పాటు కొనసాగే లాగా తీర్మానం చేశారు.

## కేయూ జంతుశాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య వై.వెంకయ్య



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం జంతు శాస్త్ర విభాగ అధిపతిగా ఆచార్య వై.వెంకయ్య నియమితులయ్యారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య వై. వెంకయ్య రెండు సంవత్సరాల కాలానికి ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుత విభాగ అధిపతి ఆచార్య షమితా పదవీకాలం పూర్తవడంతో ఈ ఖాళీ ఏర్పడింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య వై. వెంకయ్యను పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

## వెల్లివిరిసిన ఇంద్రధనుస్సు



**వరంగల్ వాయిస్ మల్హర్ :** మండలంలో బుధవారం సాయంత్రం ఇంద్ర ధనుస్సు కనువిందు చేసింది. ఉదయం నుంచి ఎండగా ఉన్న వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా మారిపోయి చిరు జల్లులు కురవడంతో ఆకాశంలో రంగు రంగుల ఇంద్రధనుస్సు ఏర్పడగా పలువురు ఆ చిత్రాలను తమ మొబైల్ లో తీసి ఆనందించారు.

## 'నమస్తే తెలంగాణ' కార్యాలయంపై దాడి దుర్మార్గం

### అల్లం నారాయణ

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వార్తా పత్రికల కార్యాలయాలపై భౌతిక దాడులకు ప్రయత్నించడం, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతి సాగర్ తీవ్రంగా ఖండించారు. వరంగల్ జిల్లా నమస్తే తెలంగాణ ఎడిషన్ కార్యాలయంపైకి అధికార పార్టీకి చెందిన వందలాది కార్యకర్తలు దాడి చేయడానికి ప్రయత్నించడాన్ని, అడ్డుకోవాలని చూసిన సిబ్బందిని దుర్భాషలాడటాన్ని వారు ఖండించారు. వార్తల విషయంలో అభిప్రాయ భేదాలు ఉంటే, న్యాయపరంగా, చట్టపరంగా ముందుకు వెళ్లాలి తప్ప, ఈ రకమైన భౌతిక దాడులకు ప్రయత్నించడం ఎంతమాత్రం సమంజసం కాదని నేతలు పేర్కొన్నారు. ఈ చర్య భావ ప్రకటన స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన మీడియా స్వేచ్ఛ హక్కును హరించే విధంగా రాజకీయ పార్టీలు వ్యవహరించడాన్ని వారు తప్పుపట్టారు. దాడికి పరోక్షంగా కారకులైన వారితోపాటు, ప్రత్యక్షంగా పాల్గొన్న వారు ఎంతటివారైనా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. ఈ రకమైన దాడులకు పూనుకుంటే, జర్నలిస్టు సమాజం చూస్తూ ఊరుకోదని, జర్నలిస్టు సంఘాలుగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి, ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని వారు హెచ్చరించారు.

## భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి సరికాదు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మడికొండలోని 'నమస్తే తెలంగాణ' దినపత్రిక వరంగల్ యూనిట్ కార్యాలయంపై జరిగిన దాడిని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్లయూజే-ఐజేయూ) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో ఈ దాడిని అనైతిక చర్యగా పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా, ప్రజాప్రతినిధి అయినా ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా, పత్రికా విలేకరులపై బెదిరింపులకు దిగడం సరియైన పద్ధతి కాదు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై వార్తలు రాసే స్వేచ్ఛ పత్రికలకు ఉంటుంది. పత్రికల్లో తమకు వ్యతిరేక వార్తలు వస్తే, వాటికి ఖండనలు, వివరణలు ఇవ్వడం చేయాలి తప్ప, బెదిరింపులకు పాల్పడటం, భౌతిక దాడులకు దిగడం అప్రజాస్వామికమని స్పష్టం చేశారు. పత్రికా కార్యాలయంపై దాడికి దిగిన వారిని వెంటనే అరెస్టు చేసి, చట్టపరంగా కఠినంగా శిక్షించాలని జర్నలిస్టు నాయకులు శ్రీరామ్ రామచందర్, మట్ట దుర్గాప్రసాద్, కోదాటి గోపాలకృష్ణ, కందుల శ్రీధర్ డిమాండ్ చేశారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో 49 మందికి జరిమానా

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.లక్ష్మీనారాయణ జరిమానా విధించారు. బుధవారం జరిగిన విచారణలో, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన 6 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున మొత్తం రూ. 3,000/- జరిమానా విధించడం జరిగింది. అలాగే, డ్రంకెన్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన 43 మంది వాహనదారులకు కోర్టు మొత్తం రూ. 39,400/- జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.సుజాత తెలిపారు.

# కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

### ■ బీజేపీ నేత రాణా ప్రతాప్ రెడ్డి

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట:** బీజేపీ నర్సంపేట నియోజకవర్గ 30 రోజుల పర్యటనలో భాగంగా, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి చెన్నారావుపేట మండలం, కోనాపురం ఎంపీటీసీ పరిధిలో పర్యటించారు. బీజేపీ చెన్నారావుపేట మండల అధ్యక్షుడు దామరప్పుల శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కోనాపురం ఎంపీటీసీ స్థాయి స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కోర్టు తీర్పు కారణంగా వాయిదా పడినప్పటికీ, ఏ క్షణాన అయినా తిరిగి నోటిఫికేషన్ రావచ్చునని, కాబట్టి కార్యకర్తలు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకు ఏ రిజర్వేషన్ వచ్చినా పోటీ చేయడానికి అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గ్రామాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి, పోటీ చేసే అభ్యర్థులను తీర్మానం చేసి ప్రతిపాదించారు. పోటీ చేసే అభ్యర్థులు, కార్యకర్తలు అందరూ సమన్వయం చేసుకుంటూ, గెలుపు లక్ష్యంగా పని చేయాలని కోరారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి



వచ్చాయని విమర్శించారు. వారి మోసపూరిత హామీలను ప్రజలకు తెలియజేస్తూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కోరారు. నర్సంపేట నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు, మండల సీనియర్ నాయకులు వనపర్తి మల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి కిసరి సాంబరాజు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో దాడులకు చోటు లేదు

### గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 'నమస్తే తెలంగాణ' దినపత్రిక వరంగల్ యూనిట్ కార్యాలయంపై జరిగిన దాడి యత్నాన్ని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోల్ల అమర్ సంయుక్తంగా ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై వార్తలు రాసే స్వేచ్ఛ పత్రికలకు ఉంటుందని ప్రెస్ క్లబ్ నేతలు స్పష్టం చేశారు. పత్రికలలో తమకు వ్యతిరేకంగా వార్తలు వచ్చినప్పుడు, వాటికి ఖండనలు ఇవ్వడం లేదా వివరణలు ఇవ్వడం చేయాలి కానీ, బెదిరింపులకు పాల్పడటం, భౌతిక దాడులకు దిగడానికి ప్రజాస్వామ్యంలో ఏ మాత్రం చోటు లేదని వారు అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా, ప్రజాప్రతినిధి అయినా, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియాపై బెదిరింపులకు దిగడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛపై దాడి సరికాదని, అధికార పార్టీ నేతలు సంయమనం పాటించాలని, మీడియాపై దాడులను ప్రోత్సహించవద్దని సూచించారు. పత్రికా కార్యాలయంపై దాడికి దిగిన వారిని తక్షణమే అరెస్టు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. దాడికి ఉసిగొల్పిన వారిని గుర్తించి, వారిపై కూడా చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## 'నమస్తే తెలంగాణ'పై దాడి హేయం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మడికొండలోని 'నమస్తే తెలంగాణ' దినపత్రిక వరంగల్ యూనిట్ కార్యాలయంపై జరిగిన దాడి యత్నాన్ని టీడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్) హనుమకొండ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు టీవీ రాజు, కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దామర రాజేందర్ సంయుక్తంగా ఈ దాడిని ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు. వార్తలు రాసే పత్రికలకు స్వేచ్ఛ ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. పేపర్లలో తమకు వ్యతిరేక వార్తలు వస్తే, వాటికి ఖండనలు ఇవ్వడం లేదా వివరణలు ఇవ్వడం చేయాలి తప్ప, బెదిరింపులకు పాల్పడటం, భౌతిక దాడులకు దిగడానికి ప్రజాస్వామ్యంలో ఏ మాత్రం చోటు లేదని వారు అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియాపై బెదిరింపులకు దిగడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి సరికాదని పేర్కొన్నారు. అధికార పార్టీ నేతలు సంయమనం పాటించాలని, మీడియాపై దాడులను ప్రోత్సహించడం సరికాదని టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సూచించారు. దాడికి ఉసిగొల్పిన వారిని గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## భట్టుపల్లిలో అరూరి పర్యటన

**వరంగల్ వాయిస్, కాజీపేట :** వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు అరూరి రమేష్ గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ పరిధిలోని భట్టుపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా భట్టుపల్లికి చెందిన రాజారపు సునీత- మోహన్ కూతురు వినూత్న చిన్నారి నూతన వస్త్ర పుష్పాలంకరణ కార్యక్రమానికి హాజరై, చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం, అదే గ్రామానికి చెందిన పూజారి వీరభద్రయ్య గారిని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వీరభద్రయ్యకి ఇటీవల గుండె సంబంధిత చికిత్స జరిగిన విషయం తెలుసుకొని, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

## కార్తీక మాస సామూహిక వన భోజనం పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పద్మశాలి పరపతి సంఘాల జేఏసీ కో-కన్వీనర్ వైద్యం రాజగోపాల్, జులైవాడ పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షుడు చిందం సుధీర్ బుధవారం కొత్తూరులోని పద్మశాలి పరపతి సంఘం కార్యాలయంలో కార్తీక మాస సామూహిక వన భోజనం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో కొత్తూరు పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షుడు తౌటం విజేందర్, ప్రధాన కార్యదర్శి బింగి శ్రీనివాస్, కోశాధికారి బింగి లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యుడు బింగి అనిల్ కుమార్ పాల్గొన్నారు. కార్తీక మాస సామూహిక వన భోజనం కార్యక్రమం నవంబర్ 9న హనుమకొండలోని శ్రీ ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించబడుతుందని వైద్యం రాజగోపాల్ తెలిపారు. ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రతి పద్మశాలి పరపతి సంఘం నుంచి అత్యధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అనంతరం కొత్తూరు పద్మశాలి పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి బింగి శ్రీనివాస్ మాట్లాడుతూ హనుమకొండలో పద్మశాలి పరపతి సంఘాల ఆధ్వర్యంలో జేఏసీ ఏర్పాటు చేసి, కార్తీక మాస సామూహిక వన భోజనం ఏర్పాటు చేయడం చాలా మంచి కార్యక్రమమని కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని తమ పద్మశాలి పరపతి సంఘం తరపున అత్యధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేస్తామని హామీ ఇచ్చారు.

## వీసం రమణారెడ్డికి పెసరు పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు వీసం రమణారెడ్డి తండ్రి వీసం రామచంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో బుధవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి రమణారెడ్డి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరామ్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పావుడాల మధుకర్, మాజీ మండల అధ్యక్షులు జంగిలి నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శులు సూర చందర్, గండు ముఖేష్, గండు పరుశురాం, గోగుల సమీ రెడ్డి, కార్తీక్, మహేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# రామ్‌చరణ్‌తో జోడిగా కృతి సనన్!

## ఛాన్స్ ఇచ్చిన సుకుమార్



ఇతర భాషల నుంచి చాలా మంది ముద్దుగుమ్మలు మన దగ్గరకు వచ్చి స్టార్స్ గా మారుతున్నారు. తెలుగు అమ్మాయిలకు మంచి అవకాశాలు వస్తున్నా కూడా ఇతర భాషల హీరోయిన్స్ మన దగ్గర స్టార్ డమ్ సొంతం చేసుకుంటున్నారు. కన్నడ నుంచి వచ్చిన రష్మిక మందన్న తెలుగు సినిమాలతోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. అలాగే హిందీ నుంచి వచ్చిన మృణాల్ మన దగ్గర టాప్ హీరోయిన్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది పేర్లు లిస్ట్ లో ఉంటాయి. అయితే ఇతర భాషల నుంచి వచ్చిన అందరు హీరోయిన్స్ సక్సెస్ అవ్వరూ.. కొంతమంది మాత్రం బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్ అందుకుంటూ ఉంటారు. దాంతో తిరిగి తమ ఇండస్ట్రీకి చెక్కేస్తుంటారు. అలానే ఓ అమ్మడు తెలుగులో రెండు సినిమాలు చేసింది. రెండు పెద్దగా ప్రేక్షకులను మెప్పించలేదు.. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? తెలుగులో డిజాస్టర్ అందుకుంది.. బాలీవుడ్ లోనూ పెద్దగా హిట్స్ లేవు. ఆయినా కూడా ఇప్పుడు ఓ బడా హీరో పిలిచి మరి ఛాన్స్ ఇచ్చాడు ఆ అమ్మడికి.. ఇంతకూ ఆమె ఎవరో కాదు.. బాలీవుడ్ పొడుగుకాళ్ల సుందరి కృతి సనన్. బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ గురించి చెప్పక్కర్లేదు. ఇప్పుడు హిందీలో సెటిల్ అయిన భామ.. ముందుగా తెలుగులోనే నటించింది. మహేష్ బాబు, సుకుమార్ కాంబోలో వచ్చిన 1 నేనొక్కడినే చిత్రంతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత నాగచైతన్యతో కలిసి దోచేయ్ అనే సినిమా చేసింది. ఈ సినిమా డిజాస్టర్ అవ్వడంతో బాలీవుడ్ షిఫ్ట్ అయ్యి అక్కడే వరుస సినిమాల్లో నటిస్తుంది. మొన్నామధ్య ప్రభాస్ తో కలిసి ఆదిపురుష్ అనే సినిమా చేసింది. రామాయణం నేపథ్యంలో వచ్చిన ఈ సినిమా డబుల్ డిజాస్టర్ అయ్యింది. ఇక ఇప్పుడు ఈ అమ్మడికి సుకుమార్ ఛాన్స్ ఇచ్చారని తెలుస్తుంది. సుకుమార్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాలో కృతి సనన్ హీరోయిన్ గా నటిస్తుందని టాక్ వినిపిస్తుంది. గతంలో సుకుమార్ తెరకెక్కించిన వన్ నేనొక్కడినే సినిమాలో కృతి హీరోయిన్ గా చేసింది. ఇప్పుడు మరోసారి ఆమెకు సుక్కు ఛాన్స్ ఇచ్చాడని తెలుస్తుంది.



## ఆర్‌టీ76తో వస్తున్న మాస్‌మహారాజ్ రవితేజ

అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా మారిపోయాడు. ఇప్పటికే భాను భోగవరపు దర్శకత్వంలో నటిస్తోన్న మాస్ జాతర సినిమా అక్టోబర్ 31న విడుదలకు రెడీ అవుతోంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ కూడా కొనసాగుతున్నాయి. కాగా ఈ సినిమా రీలీజ్ కాకముందే రవితేజ కొత్త సినిమా వార్త నెట్టింట వైరల్ అవుతోంది. కిశోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఆర్‌టీ76. ఈ చిత్రంలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ మూవీ అప్‌డేట్ షేర్ చేసి మూవీ లవర్స్, అభిమానుల్లో జోష్ నింపుతోంది ఆషికా రంగనాథ్. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ స్పెయిన్‌లో కొనసాగుతోంది. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ ప్రాజెక్టు 2026 సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఇండియాకు తిరిగిరాగానే మాస్ జాతర ప్రమోషన్స్‌తో బిజీ కానున్నాడు రవితేజ. ఈ చిత్రలో రవితేజ రైల్వే పోలీసాఫీసర్‌గా సందడి చేయబోతున్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కుతున్ నీ చిత్రంలో రాజేంద్రప్రసాద్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నాడు.

## నిద్రపోకుండా అదే చేసేదాన్ని.



కొన్ని కాంబినేషన్ల కోసం చాలా సందర్భాల్లో ముమ్మరంగా ప్రయత్నిస్తూనే ఉంటారు. కానీ, అనుకున్నప్పుడు వర్కవుట్ కావు. కానీ, అనుకోని సందర్భాల్లో స్క్రీన్ మీద తళుక్కుమంటాయి. అలాంటి కాంబో డ్యూడ్ మూవీకి కుదిరిందని అంటున్నారు ప్రదీప్ రంగనాథన్. ఆయన హీరోగా నటించిన సినిమా 'డ్యూడ్'. మమిత బైజు హీరోయిన్‌గా నటించారు. ''డ్యూడ్‌లో నేను చేసిన కేరక్టర్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. అసలు ఇలాంటి రోల్ కెరీర్లో ఇంత ఎర్లీ స్టేజ్‌లో చేస్తానని నేను ఊహించనేలేదు. అందుకే ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. డైలాగులు కూడా రాత్రుళ్లు ఇంటికి తీసుకెళ్లి బట్టీపట్టేదాన్ని. నిద్రపోకుండా ప్రాక్టీస్ చేసేదాన్ని. లైన్స్ గుర్తుంటే కెమెరా ముందు ఎంతైనా ఎమోషన్స్ పండిరచడానికి వెసులుబాటు ఉంటుంది. ఆ విషయం డ్యూడ్‌తో నాకు బాగా తెలిసొచ్చింది. ఫ్యూచర్‌లోనూ ఇలాంటి కేరక్టర్లు వచ్చినప్పుడు ఈ ప్రాక్టీస్ ఉపయోగపడుతుంది'' అని అన్నారు మమిత. తమిళంతోపాటు తెలుగులోనూ ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ వస్తుంది. మరోవైపు భారీగా కలెక్షన్స్ కొల్లగొడుతుంది. ఈ చిత్రంలో మమితా, ప్రదీప్ జంటగా నటించిన సంగతి తెలిసిందే.

# అంతమంది లైన్ వేశారా?



తెలుగు, తమిళ ఇండస్ట్రీల్లో స్ట్రాంగ్ ఉమెన్ క్యారెక్టర్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన హీరోయిన్ రమ్యకృష్ణ . ఇటీవల జీ తెలుగు షో జయమ్ము నిశ్చయమ్మురాలో సందడి చేసింది. గ్లామర్ హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించిన రమ్యకృష్ణ, రాఘవేంద్రరావు దర్శకత్వంలో వరుసగా సినిమాలు చేసి స్టార్ స్టేటస్ దక్కించుకుంది. ఇక బాహుబలిలో శివగామి పాత్ర ద్వారా కెరీర్‌లో మరో మెట్టు ఎక్కిన విషయం తెలిసిందే. తాజాగా జగపతి బాబు షోకి హాజరైన రమ్యకృష్ణ ఆసక్తికర కామెంట్స్ చేసింది. అయితే రమ్యకృష్ణ ఎంట్రీతో షో హోస్ట్ జగపతిబాబు కుర్రాడిలా మారి, స్టైలిష్‌గా ప్రవర్తించడం, టీషర్ట్‌లో యంగ్ లుక్‌లో కనిపించడం, స్టెప్పులేసి రమ్యకృష్ణని ఇంప్రెస్ చేసుకోవడానికి ప్రయత్నించడం హైలైట్‌గా నిలిచింది. రమ్యకృష్ణ, తన ఫన్నీ ఎక్స్‌ప్రెషన్స్‌తో జగపతిబాబును కవర్ చేయడం, కౌంటర్ ఇచ్చి షోను మరింత ఆసక్తికరంగా మార్చడం ప్రేక్షకులను అలరించింది.మొత్తంగా రమ్యకృష్ణ, జగపతిబాబు మధ్య ఫన్నీ కౌంటర్ డైలాగ్స్, ఎంటర్టైనింగ్ ఎక్స్‌ప్రెషన్స్‌లు షోను సక్సెస్‌ఫుల్‌గా మార్చనున్నాయి.'నీకు చిన్నప్పట్నుంచి చాలా మంది సైట్ కొట్టడం, ప్రేమించడం, పడి దొర్లడం.. అని జగపతిబాబు చెబుతుండగానే .. 'ఇన్‌క్లూడిరగ్ యూ (నువ్వు కూడా) అంటూ జగ్గు బాయ్ ముఖం మీదే నవ్వుతూ చెప్పేసింది. దీనికి జగపతి బాబు కూడా స్మైలింగ్ ఎక్స్ ప్రెషన్స్ ఇచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ప్రోమోలు నెట్టింట వైరలవుతున్నాయి. కాగా, రమ్యకృష్ణ పాజిటివ్, నెగటివ్ పాత్రలలో ఆకట్టుకుంటూ ఉంటే, జగపతిబాబు కూడా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పవర్‌ఫుల్ రోల్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇలాంటి ఎంటర్‌టైనింగ్ కంటెంట్ , బలమైన పాత్రల కలయిక, ప్రేక్షకుల మన్ననలు రమ్యకృష్ణ, జగపతిబాబులని టాప్ ఫేవరేట్స్‌గా నిలబెట్టింది. జగపతిబాబు, రమ్యకృష్ణ కలిసి పలు సినిమాల్లో నటించారు. ఆయనకు ఇద్దరు, బడ్జెట్ పద్మనాభం తదితర చిత్రాల్లో హీరో, హీరోయిన్లుగా నటించారు. ఇక జగపతి బాబు ప్రస్తుతం విలన్ గా, సహాయక నటుడిగా రాణిస్తున్నారు. అలాగే టీవీ షోలకు హోస్ట్ గా వ్యవహరిస్తున్నారు.

# మొదటి రోజు కలెక్షన్లు అదుర్స్

నేషనల్ క్రష్ రష్మిక మందన, బాలీవుడ్ హీరో ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో దర్శకుడు ఆదిత్య సర్పోదర్ రూపొందించిన హారర్ కామెడీ చిత్రం 'థామా'. ఈ సినిమా దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్ దక్కించుకున్న ఈ చిత్రం మంచి వసూళ్లను రాబడుతుంది. ఈ చిత్రం తొలిరోజే రూ. 25.11 కోట్ల వసూళ్లు రాబట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. అంతేగాకుండా ఆయుష్మాన్ ఖురానా కెరీర్‌లో మొదటిరోజు ఈ స్థాయిలో వసూళ్లు సాధించిన మొదటి చిత్రంగా 'థామా' చిత్రం నిలిచింది. మరోవైపు వీకెండ్ వస్తుండటంతో ఈ కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ సినిమాను మాడాక్ ఫిల్మ్స్ నిర్మించింది.



# రెండేళ్లలో రూ.1,400 కోట్లు మంజూరు

- నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**(మొదటి పేజీ తరువాయి..)** నీడిగొండ, ఫతేషాపూర్, మాదారం మీదుగా ఖిలాషపూర్ వరకు రూ.6కోట్లతో బిటీ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి కాలువల వెంట, రిజర్వాయర్ల వెంట తిరుగుతూ అధికారులతో మాట్లాడుతూ కాలువలు తీయించడం, మారమ్మతు పనులు చేయించడం, సీసీ లైనింగ్ చేయించడంతో ఈ రోజు అశ్వరావుపల్లి కుడి కాలువ ద్వారా రఘునాథపల్లి, లింగాల ఘనపూర్ మండలాలకు రెండు పంటలకు సాగు నీరు అందించగలుగుతున్నామన్నారు. యాసంగిలో కూడా పటేల్ గూడెం చెరువు నింపి రఘునాథపల్లి రైతులకు సాగు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమాన్ని కోరుకునే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. ప్రజలందరూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### ఇబ్బందులు లేకుండా..

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా క్లీనింగ్ మిషన్, తేమ మిషన్, తాగు నీరు, విద్యుత్ లైట్లతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని నిర్వహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కల్లానికి వచ్చిన ధాన్యంలో ఒక్క గింజ కూడా తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలకు ఉపాధి కల్పించాలి, మహిళా సంఘాలను బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతోనే మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకూడదని ఎవరైనా డబ్బులు అడిగితె తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

### దళారులను నమ్మొద్దు..

రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలోనే ధాన్యం అమ్ముకోవాలని, దళారుల వద్దకు వెళ్లి నష్ట పోవద్దని కడియం శ్రీహరి సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోతే మిల్లర్లు కనీసం 2వేలు కూడా పెట్టారని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనడం లేదని వెల్లడించారు. మొదటి గ్రేడ్ రకం ధాన్యానికి 2389రూపాయలు, సాధారణ రకం ధాన్యానికి 2369 రూపాయల మద్దతు ధరను ప్రభుత్వం అందిస్తున్నట్లు వివరించారు. ఈ సీజన్లో రైతులకు మద్దతు ధరతో పాటే బోనస్ డబ్బులు కూడా రైతుల ఖాతాలలో వారం రోజుల లోపలనే జమ కానున్నాయని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకొవాలని, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం అమ్మాలని కోరారు.

### రైతు పక్షపాతి..

రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని కడియం శ్రీహరి వెల్లడించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. 25 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణ మాఫీ చేయడం, తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు రైతులకు పెట్టుబడి సాయం అందించడం ఒక చరిత్ర అని కొనియాడారు. సన్నాలకు రూ.500 బోనస్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తూ రైతులకు అండగా ప్రభుత్వం నిలబడుతుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ అవసరాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు వంటి ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఆర్డీవో, డీఆర్ డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఏఈవో, డీపీఎం, ఏపీఎం, మహిళా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.











## మహా రుద్రయాగానికి రండి

### కుడా చైర్మన్ ఇనగాలకు ఆహ్వానం

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** పరకాల పట్టణంలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ కుంకుమశ్వర స్వామి దేవస్థానంలో వచ్చే నెల 3న నిర్వహించనున్న కార్తీక మాస మహా రుద్రయాగ మహోత్సవానికి హాజరు కావాలంటూ ఆహ్వానం పలికారు. కుంకుమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, ఆలయ కమిటీ డైరెక్టర్ తోట రవి, మహా రుద్రయాగ సమితి అధ్యక్షులు ఎర్ర లక్ష్మణ్, మహా రుద్రయాగ సమితి కన్వీనర్ గందె రవి గారు, సమితి సభ్యులు చిట్టి రెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు బుధవారం కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని కుడా కార్యాలయంలో కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

### ప్రహరీ నిర్మించాలి..

గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ గొర్రెకుంట గ్రామ కట్ట మల్లన్న దేవాలయ పూజారి, కమిటీ చైర్మన్ గాజు శ్రీనివాస్, అధ్యక్షులు కట్కూరి సారయ్య, కమిటీ సభ్యులు కలిసి దేవాలయం ప్రహరీ గోడ నిర్మాణం కోసం ఆర్థిక ◌ాయం అందించాలని వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పత్తిపాక తిరుపతి, డైరెక్టర్లు ప్రవీణ్, శివకుమార్, రాధా కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేడారంపై ఉన్నత స్థాయి సమీక్ష

- ఏర్పాట్లపై దిశా నిర్దేశం
- నిర్వహించిన గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్
- పాల్గొన్న కలెక్టర్లు, పోలీసులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మేడారం మహాజాతర సందర్భంగా ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహా జాతరకు గిరిజన సంక్షేమ శాఖ రూ.150 కోట్లు మంజూరు చేయగా అందులో రూ.90 కోట్లు సివిల్ పనులకు, రూ.60 నాన్ సివిల్ పనులకు కేటాయించారు. దీంతో ఈ సమావేశంలో సివిల్ వర్క్స్ స్టేటస్, నాన్ సివిల్ వర్క్స్ యాక్షన్ ప్లాన్ మీద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్యసాచి ఘోష్ ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.తో కలిసి మాట్లాడుతూ.. మేడారం జాతర ఏర్పాట్లను మొత్తం ఎనిమిది జోన్లు, 31 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. జంపన్న వాగు ప్రాంతాన్ని జోన్–3లో చేర్చినట్లు వెల్లడించారు. జాతర సమయంలో 10 నుంచి 12 వేలమంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొననున్నట్లు ప్రకటించారు. ప్రతి జోన్‌కు ఒక జోనల్ ఆఫీసర్ ను నియమించనున్నారు. ఇంటర్ నెట్ సౌకర్యానికి ఎలాంటి విఘాతం కలుగకుండా 24 శాశ్వత టవర్స్, 20 సెల్–ఆన్–వీల్స్, 350 వై–ఫై పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కోర్ రూట్లు, పార్కింగ్ ప్రదేశాలను గుర్తించినట్లు వెల్లడించారు. 1050 ఎకరాల్లో మొత్తం 49 పార్కింగ్ ప్రదేశాలు గుర్తించామన్నారు. దాదాపు 4.5 నుంచి 6 లక్షల వాహనాలు నిలిపే సదుపాయం కల్పించబడుతుందన్నారు. ఈ ఏర్పాట్లు నవంబర్ 30 నాటికి పూర్తవుతాయని తెలిపారు.

### అన్ని శాఖల సమన్వయంతో..

అటవీ శాఖ ఆధ్వర్యంలో 24+9 ఫారెస్ట్ రోడ్లు (కచ్చా నుంచి డబుల్ లేన్) రూపంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. వీటిలో భాగంగా వైల్డ్ లైఫ్ శాంక్చువరీలోని రహదారులు కూడా చేర్చినట్లు తెలిపారు. ఆర్ & బీ శాఖ ద్వారా రూ.42 కోట్లతో ఆలయం చుట్టూ రహదారులు, రూ.92 కోట్లతో ప్రధాన రహదారులు నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. జాతర సమయానికి ముందు, మధ్య, తరువాత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక జాతర సందర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. జంపన్న వాగు వద్ద తాత్కాలిక రహదారి కూలిపోయిన కారణంగా మరమ్మత్తు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. 517 బోరు పాయింట్లు, నీటి వనరులు, 250 కిలోమీటర్ల రహదారులపై లైటింగ్ పనులు జరుగుతున్నాయని వివరించారు. స్థానికుల సహకారంతో ఆరు స్లాటర్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. జంపన్న వాగు పునరుద్ధరణ పనులు సాగిస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.

### 259 ట్రాన్స్ ఫార్మర్లు..

విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయాలు కలుగకుండా 9,111 విద్యుత్ స్తంభాలు, 259 ట్రాన్స్ ఫార్మర్లు అమర్చే పనులు విద్యుత్ శాఖ చేపట్టిందన్నారు. జాతర ప్రాంతమంతా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశ ఏర్పాట్లు (ఇల్యూమినేషన్) చేయనున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర విజయవంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని సబ్యసాచి ఘోష్ ఆదేశించారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగత్, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరిష్, ములుగు ఎస్పీ, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఎలక్ట్రిసిటీ సీఎండీ వరుణ్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక, ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొని ఇన్ పుట్ అందించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com